క్లుప్తంగా

బందరు ఆర్డీఓ వాణి బాధ్యతల స్వీకారం



చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారిగా మొవిడి వాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బందరు ఆర్డీవోగా ఎం వాణి ని నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఆమె జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందజేసేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించి ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచుతానని తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బంటుమిల్లి: మల్లపరాజుగూడెం గ్రామంలో శుక్రవారం స్థానిక పాల కేంద్రం వద్ద పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. 2022-23 సంవత్సరానికి 173 మంది రైతులకు మంజూరైన రూ. 91630లను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పంపిణీ చేశారు. గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజరు టి.సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్ అర్జా నగేష్, స్థానిక సొసైటీ అధ్యక్షుడు పుప్పాల శ్రీరామూర్తి, సూపర్‌వైజర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకువెళ్లిన కారు

కోడూరు: దసరా సెలవులను పురస్కరించుకొని స్వగ్రామానికి వస్తున్న ఓ కుటుంబానికి చెందిన కారు అదుపు తప్పి పంటకాలువులోకి దూసుకువెళ్లింది. ఈ ఘటన కోడూరులో చోటు చేసుకుంది. మండలంలోని వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన యలవర్తి రవి వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. దసరా సెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి కారులో వి.కొత్తపాలెంకు బయలుదేరాడు. వి.కొత్తపాలెం-మాచవరం గ్రామాల మధ్య కారు అదుపు తప్ప పల్టీలు వేస్తూ పక్కనే ఉన్న ప్రధాన పంట కాలువలోకి దూసుకువెళ్లింది. వంతులవారీ విధానంతో కాలువలో సాగు నీరు తక్కువగా ఉండడంతో కారు నీటిలో మునిగిపోలేదు. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, రహదారి వెంట ప్రయాణించే వారు కారు అద్దాలు పగులకొట్టి రవిని, కుటుంబ సభ్యులను బయటకు తీశారు. కారులోని వారంతా సురక్షితంగా ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా వైద్యసిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులు చేయించారు. చిత్తడిగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమలను మందును చల్లించారు.

ముస్లింల శాంతి ర్యాలీ



మచిలీపట్నంటౌన్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ ముస్లింలు శుక్రవారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముస్లిం ఐక్య వేదిక, పలు ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ రాజుపేట కొత్తమసీదు సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు జరిగింది. పాలస్తీనాలోని అమాయక ప్రజలపై ఇజ్రాయెల్ సైనికులు సాగిస్తున్న చర్యలను వారు తీవ్రంగా ఖండిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ముస్లిం ప్రముఖులు మాట్లాడుతూ పాలస్తీనాపై దాడులను మానవతావాదులంతా ఖండించాలని, ఇజ్రాయెల్ సైనికుల చర్యలను ఖండిస్తూ ఐక్యరాజ్య సమితి పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని కోరారు. శాంతి ర్యాలీకి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్ దాదా, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండీ సదరుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకుడు మాదివాడ రాము, కాంగ్రెస్ నాయకురాలు నల్లబ్రోలు కుమారి, అబ్దుల్ మతీన్ మద్దతు తెలిపారు. జామియా మసీదు అధ్యక్షుడు అంజద్‌పాషా, మౌలాలి అజీమ్, ఇలియాస్‌పాషా, సయ్యద్‌ఖాజా పర్యవేక్షించారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

గూడూరు: వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంభించేలా వ్యవసాయ సహాయకులు రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి అన్నారు. గూడూరు వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వీఏఏలతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గూడూరు ఏట జి.వి.శివప్రసాద్, మండలంలోని వివిధ గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

- ఆరో రోజుకు చేరిన ఉత్సవాలు
- చదువుల తల్లిగా అమ్మవార్ల దర్శనం



గణపేశ్వరంలో సరస్వతీదేవిగా దుర్గమ్మ



సరస్వతీదేవిగా పెడన పైడమ్మ అమ్మవారు



గూడూరులో సరస్వతీదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



సరస్వతీదేవిగా విశ్వనాథపల్లి నాంచారమ్మ అమ్మవారు



సరస్వతీ దేవిగా కోడూరు కనకదుర్గమ్మ



మోపిదేవిలంకలో సరస్వతీదేవిగా దుర్గమ్మ



బందరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



నాగాయలంకలో సామూహిక సరస్వతీ పూజ



బంటుమిల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీ దేవీ పూజలు

గణపేశ్వరం(నాగాయలంక): దేవీ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. అవనిగడ్డ, పెడన, మచిలీపట్నంలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూలా నక్షత్రం కావడంతో అమ్మవార్లు చదువుల తల్లి సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. తెల్లవారు జామునుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. నాగాయలంక మండలం గణపేశ్వరంలో దుర్గా గణపేశ్వరస్వామి ఆలయాలలో సరస్వతీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భావదేవరపల్లిలో అంకాలదేవర, అన్నపూర్ణాదేవి ఆలయాలలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వర స్వామివారి దేవస్థానంలో పార్వతీదేవి, శ్రీకన్యాంబ మూల విరాట్‌లను, కృష్ణానది తీరంలోని శ్రీరామపాద క్షేత్రం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు.

- గూడూరు: గూడూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, ద్వారకా నగర్‌లోని యాదవుల రామాలయం, కప్పలదొడ్డిలోని ఆలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

చిన్నారుల అక్షరాభ్యాసం

మోపిదేవి: మోపిదేవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ ఆలయంలో సరస్వతీదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు.

- కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారిని చదువుల తల్లిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిపారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి వెండి వీణను ధరింపజేసి సరస్వతిదేవిగా అలంకరించారు. సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో విద్యార్థులకు అక్షరాభాస్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పలకలు, పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఉల్లిపాలెం శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో చిన్నారులకు నాలుకపై బీజాక్షరాలను రాశారు. మందపాకల అద్దంకి నాంచారమ్మ, మాచవరం తుంగపల్లెమ్మ, లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపురసుందరీ, కోడూరులోని పార్వతి, దానాశక్తి అమ్మవార్ల ఆలయాల్లో చదువుల తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. నరసింహపురంలో నెలకొల్పిన దుర్గమ్మ విగ్రహాన్ని సరస్వతిదేవిగా అలంకరించి, విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరస్వతీ పూజలు, హోమాలు..

మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంకలో నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతి సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

700 మంది బాలలచే సరస్వతీ పూజలు

నాగాయలంక: మండలంలోని పలు దేవాలయాల్లో వందలాది మంది బాలబాలికలు సామూహిక సరస్వతీ పూజ నిర్వహించారు. స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి దేవస్థానంలో 200 మంది బాలలచే సామూహిక సరస్వతీ పూజ జరిగింది. నాగాయలంక, పరిసర గ్రామాలకు చెందిన బాలలు పూజలో పాల్గొన్నారు. దాతల వితరణతో పూజలో పాల్గొన్న బాలలందరికీ పుస్తకాలు, పెన్నులు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివ నాగేశ్వరరావు చేతులమీదుగా బహూకరించారు. 500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో 150 మంది బాలలు, మండలంలోని గణపేశ్వరాలయంలో 250 మంది బాలబాలికలచే సామూహిక సరస్వతీ పూజ, వ్రతం నిర్వహించారు. భావదేవరపల్లి గ్రామంలో 100మంది బాల బాలికలు సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న బాలలు, భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

దుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు. కొక్కిలిగడ్డలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, సువాసినీలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. టేకుపల్లిలో బాల పార్వతి సమేత రామేశ్వరస్వామివారి దేవస్థానంలో సరస్వతీ పూజ, హోమం జరిగాయి.

- బంటుమిల్లి: బంటుమిల్లి కనకదుర్గ అమ్మవారి ఆలయం, పెదతుమ్మిడి, పాశ్చాపురం గ్రామాల్లోని శివాలయాలు, వైష్ణవాలయాల్లో విద్యార్థులచే సరస్వతీ దేవీ పూజలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వాహకులు పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీబాక్సులు అందజేశారు. ఆలయాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- పెడన: పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీ దేవి పూజ నిర్వహించారు. సరస్వతి దేవి హోమం, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పైడమ్మ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నందమూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద మంత్రి జోగి రమేష్ పూజలు నిర్వహించారు. నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సరస్వతీ పూజలు నిర్వహించారు.
- కోనేరుసెంటర్: ఎస్ఎస్ గొల్లపాలెంలోని ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా ఉమాదేవి అమ్మవారు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమపూజ, 200 మంది బాలబాలికలచే సామూహిక సరస్వతీ పూజ నిర్వహించారు.
- మచిలీపట్నంటౌన్: ఈడేపల్లి శక్తి గుడిలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పలువురు భక్తులు మేకలు, కోళ్లను తీసుకువచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బుట్టాయిపేట దత్తాశ్రమంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను దత్తాశ్రమం నిర్వాహకుడు శ్రీనివాస్ పర్యవేక్షించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలబాలికలు సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆలయంలోని పార్వతిదేవి అమ్మవారు సరస్వతీదేవిగా, కన్యకాపరమేశ్వరి దేవి విద్యాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. రాత్రికి హైదరాబాద్‌కు చెందిన పేరడీ శ్రీనివాస్ చేసిన పేరడీ నృత్యం భక్తులను ఆకట్టుకుంది. సింగరాజు కల్యాణి శిష్య బృందం ఆలపించిన శాస్త్రీయ సంగీతం వీనులవిందు చేసింది. చింతగుంటపాలెంకు చెందిన రామలింగ చౌడేశ్వరి భక్తబృందం నిర్వహించిన నారసాల ప్రదర్శన ఆకట్టుకుంది. రాజుపేటలోని భ్రమరాంబ సమేత రాజమౌశేశ్వరి మందిరం (ముచ్చింగుడి)లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ప్రధాన రహదారిలోని గీతామందిరంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు సరస్వతిదేవిగా, లలితా అమ్మవారు విద్యాలక్ష్మీదేవిగా పూజలందుకున్నారు. ఈడేపల్లిలోని కృష్ణ శక్తి గుడిలో కాళికాదేవికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేట రామ లింగేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బచ్చుపేట హిందూ హైస్కూల్ ఆవరణలోని శారదా మందిరంలో విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ బి. సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవిగా పూజలందుకున్నారు.

చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

- రామానగరం(వల్లపల్లి): స్థానిక గంగానమ్మ గుడి, రామాలయం ప్రాంగణంలో దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించారు. దుర్గాదేవీ కమిటీ ఆధ్వర్యంలో భక్తులచే సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. శనివారం చండీహోమం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆయుష్షు పెంచేలా వైద్య సేవల విస్తరణ

- ఆర్థికంగా..ఆరోగ్యపరంగా ఆదుకుంటున్న సీఎం జగన్
- మంత్రి జోగి రమేష్



జింజేరు శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించి ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా వారి ఆయుష్షు పెంచేలా వైద్య సేవలు విస్తరిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పెడన మండలం జింజేరు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటిలో ఆరోగ్య సమస్యలపై సర్వే చేసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా సిఫార్సు చేసి ఉచితంగా చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందని వివరించారు. శిబిరంలో 463 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో నాడు-నేడు రెండో దశ కార్యక్రమం కింద మరమ్మతులు చేసిన అంగన్‌వాడీ భవనానికి మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుతరావు, రామానాయుడు, కొండవీటి నాగబాబు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, సర్పంచులు వేముల సత్యనారాయణ, జక్కుల నరసింహ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- మచిలీపట్నంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజలకు ఎంతగానో మేలు చేస్తున్నాయని 28వ డివిజన్ కార్పొరేటర్ షేక్ షాహెదా అన్నారు. ఇనుగుదురుపేట మునిసిపల్ ప్రత్యేక ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్ పర్యవేక్షించారు.

817 మందికి వైద్య పరీక్షలు..

గూడూరు: ఆకులమన్నాడులో మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 817 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, ఫైజుల్ రహ్మాన్(మున్నా), ఎంపిటీసీ కోళ్ల లక్ష్మణరావు, సర్పంచి మహ్మద్ రఫీ, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బంగారు భవిష్యత్ జగన్‌తోనే సాధ్యం

అయోధ్యరామిరెడ్డి, పేర్ని నాని



మాట్లాడుతున్న అయోధ్యరామిరెడ్డి. చిత్రంలో పేర్ని నాని, మేయర్ వెంకటేశ్వరమ్మ

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్రానికి బంగారు భవిష్యత్ కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసే బాధ్యత మనందరిపై ఉందని రాజ్యసభ సభ్యులు, రీజనల్ కో-ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. మచిలీపట్నం నియోజకవర్గ స్థాయిలో పోర్టు, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్, వేల మందికి నివేశనా స్థలాలు అందజేశామన్నారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలులను వివరించి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించాలని ప్రజలను కోరాలని సూచించారు. పేర్ని నాని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి జగనే సీఎం కావాలని ధైర్యంగా చెప్పగలిగే స్థాయిలో మనం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఆరు నెలలు సమష్టిగా పనిచేయాలని చెప్పారు. మండలస్థాయి నాయకులంతా ఒక గ్రామంలో బస చేయటం, రెండో రోజు ఉదయమే పార్టీ జెండాలను ఆవిష్కరించుకోవడం, అనంతరం ఇంటింటికి తిరిగి సంక్షేమం, అభివృద్ధిని వివరించడం, లోపాలను సవరించుకోవడం కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. పేర్ని కిట్టు, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, నరసాపురం మునిసిపల్ చైర్మన్ బర్రె వెంకటరమణ జయరాజ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ సలార్ దాదా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కన్వీనర్లు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన బుద్ధప్రసాద్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధ్వజం
- ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అంత మోసకారి, దగాకోరు నాయకుడు మరొకరు ఉండరని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.165 కోట్లు డెల్టా ఆధునికీకరణ నిధులు వస్తే రైతులకు ఉపయోగపడే అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు నిర్మించకుండా రైతులను మోసం చేశారన్నారు. టీడీపీలో చేరి అంబటి శ్రీహరిప్రసాద్‌కు సీటు రాకుండా మోసం చేయగా, పులిగడ్డ-పెనుమూడి వారధి ఉద్యమాన్ని హైజాక్ చేసి దివిసీమ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. 70 వేలు కాపు సామాజిక వర్గం ఉన్న అవనిగడ్డ సీటు జనసేనకు వెళుతుందనే భయంతో వాళ్లను వెంట పెట్టుకుని వారినే మోసం చేసేందుకు బుద్ధప్రసాద్ కుట్రలు చేస్తున్నారన్నారు. ఎవరు మోసగాడో, ఎవరు దగాకోరో, ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమని, తనను మోసగాడని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుద్ధప్రసాద్‌కు సవాల్ చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ ఉనికి కోసం పొలం బాట పట్టిన బుద్ధప్రసాద్ దాలిపర్రు, యండకుదురు, లంకపల్లిలో పంటలు ఎండిపోయి పంటను దున్నించినపుడు ఏమి చేశాడని ఎద్దేవా చేశారు.

జన సైనికులను రెచ్చగొట్టి దాడికి యత్నం

144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ ధర్నా పేరుతో తనపై దాడి చేసేందుకు మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ జన సైనికులను తనపై దాడికి పంపించారని ఎమ్మెల్యే సింహాద్రి అన్నా రు. జనసేన, టీడీపీ నేతల చర్యలను తీవ్రంగా ఖండించారు.

22ఏ భూముల సమస్యను సీఎంతో మాట్లాడి పరిష్కరించామన్నారు. అవనిగడ్డలో కిడ్నీ బాధితులకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పూర్తయిందని, త్వరలోనే మంత్రిచే ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఎదురుమొండి వారధి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. కోడూరు రహదారి పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు. మరికొన్ని హామీలను త్వరలోనే నెరవేస్తామని వివరించారు. వైఎస్సార్‌సీపీ, జనసేన మధ్య గొడవలు పెట్టి లబ్ధి పొందేందుకు బుద్ధప్రసాద్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే సింహాద్రి ధీమా వ్యక్తం చేశారు.

బంద్‌కు అనుమతి లేదు

అవనిగడ్డ సర్కిల్ పరిధిలో సెక్షన్ 144 అమలులో ఉన్నందున బంద్‌కు అనుమతి లేదని సీఐ ఎల్. రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డలో శనివారం జనసేన, టీడీపీ ఇచ్చిన బంద్‌కు అనుమతి లేదని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన నేతలు కవ్వింపు చర్యలు..ఉద్రిక్తత

అవనిగడ్డ: జనసేన, టీడీపీ నేతల కవ్వింపు చర్యల వల్ల అవనిగడ్డలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవనిగడ్డ పర్యటనలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ముందు ధర్నాకు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన నేతలు ధర్నాకు వెళ్లకుండా ముందస్తు హౌస్ అరెస్టులు చేశారు. కొంతమంది మహిళలు జనసేన కార్యాలయం నుంచి ధర్నాకు బయలు దేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ధర్నా చేయమని, ప్రధాన రహదారిలో ప్రదర్శనగా వెళతామని చెప్పడంతో ఒకరిద్దరు పోలీసులను సెక్యూరిటీగా పంపించారు. వారు ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకోగానే దగ్గరలో ఉన్న మరికొంతమంది వారికి తోడై ఒక్కసారిగా రహదారిపై బైఠాయించి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కడికి చేరుకుని సీఎం జిందాబాద్ అంటూ ప్రతి నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి పంపించి వేశారు. సీఐ ఎల్. రమేష్ అక్కడికి చేరుకుని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కూడా అక్కడి నుంచి పంపించి వేశారు.

ప్రకటన

[illegible]

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

పెడన: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కృష్ణా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మున్సిపల్ ఉద్యోగులకు న్యాయవిజ్ఞాన సదస్సుపై అవగాహన కార్యక్రమం పెడన పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ పెడన మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీగల్ సిబ్బంది ప్రతి శనివారం మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ క్లినిక్ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తోందని, నిరుపేదలకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామని తెలిపారు. న్యాయవాది మునలయ్య, పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కమిషనర్ బి. మహేంద్ర, ఎస్ఐ రవికుమార్, పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, కౌన్సిలర్ మెట్ల సుబ్రహ్మణ్యం, సేవాధికార సంస్థ న్యాయవాది అజ్మతున్నీసా, న్యాయవాది మునలయ్య, సత్యనారాయణ, ఏఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ కార్యాలయం ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుని కించపరిచేలా నినాదాలు చేయడం జనసేన మహిళలకు తగదని ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ, సర్పంచ్ విలేకరులతో మాట్లాడారు. 144 సెక్షన్ అమలులో ఉండగా ఎలా ధర్నా చేస్తారని ప్రశ్నించారు. వీర మహిళలు అంటే మహిళా పోలీసులపై దౌర్జన్యం చేయడం, సీఎం, ఎమ్మెల్యేలను కించపరిచేలా నినాదాలు చేయడమేనా అని వారు ప్రశ్నించారు.

వైఎస్సార్ బీమా అందజేత

చల్లపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన ఘటనలో నారాయణరావు నగర్ కాలనీకి చెందిన చినసాంబయ్య మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను శుక్రవారం మృతుని భార్య నాగమల్లికి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ కృష్ణకుమారి అందజేశారు.

వృద్ధుడిని ఆస్పత్రికి తరలించిన గుప్తా

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌లో కురిచేటి హనుమంతరావు అనే వృద్ధుడు ఓ గృహం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చాడు. వాహనం వచ్చిన అనంతరం వృద్ధుడిని వాహనం ఎక్కించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వృద్ధుడు హనుమంతరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.